సాక్షి
అనంతపురం
బుధవారం : 8 : మే : 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



జేసీకి భంగపాటు తప్పదు

ఈ ఎన్నికల్లో జేసీ కుటుంబానికి భంగపాటు తప్పదని ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
43.1°/25.9°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స శిబిరాలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 13న ప్రథమ చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రథమ చికిత్స శిబిరాల వద్ద ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించడంతో పాటు కోవిడ్ సంబంధిత జాగ్రత్తలు తెలియ జేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, ఓబులు, ఎస్‌ఓ మహమ్మద్ రఫి, ఫార్మసిస్టు రమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తొలివిడత కౌన్సెలింగ్‌కు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏ ఐటీఐలో చేరాలకున్నారో ఆన్‌లైన్‌లోనే ఎంచుకోవచ్చని వెల్లడించారు. జూన్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ కింది ట్రేడ్‌లలో అడ్మిషన్లు చేపడతారు. కోపా (ఏడాది కోర్సు), డి/మాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్ (రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (రెండేళ్లు), ఫిట్టర్ (రెండేళ్లు), మెషినిస్ట్ గ్రైండర్ (రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (రెండేళ్లు), మెకానిక్ డీజిల్ (ఏడాది), టర్నర్ (రెండేళ్లు), వైర్‌మెన్ (రెండేళ్లు), వెల్డర్ (ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్ (రెండేళ్లు), డ్రెస్ మేకింగ్ (ఏడాది), ప్లంబర్ (ఏడాది), ఇన్‌స్టుమెంట్ మెకానిక్ (రెండేళ్లు), ఐసీటీఎస్‌ఎం (రెండేళ్లు), మెషినిస్ట్ (రెండేళ్లు).

జిల్లాకు ప్రత్యేక వ్యయ పరిశీలకుల రాక



నీనా నిగమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ ఐఏఎస్ (రిటైర్డ్) మంగళవారం జిల్లాకు చేరుకున్నారు. నగరంలో ఓ హోటల్‌కు చేరుకున్న ఆమెకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం నగరంలో పడుతున్న వర్షం

పలకరించిన వరుణుడు

అనంతపురం అగ్రికల్చర్: వరుణదేవుడు పలకరించాడు. భానుడి దెబ్బకు అల్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజలకు ఉపశమనం కలిగించాడు.మంగళవారం సాయంత్రం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వాన కురిసింది. శెట్టూరు, ఉరవకొండ, బ్రహ్మసముద్రం, ఆత్మకూరు, డీ హీరేహాళ్, కళ్యాణదుర్గం, అనంతపురం, కూడేరు, రాయదుర్గం, బెళుగుప్ప, కంబదూరు, పామిడి, బీకేఎస్, పెనుకొండ, హిందూపురం, మడకశిర, పరిగి, గుడిబండ, బత్తలపల్లి, అమరాపురం, సోమందేపల్లి, నల్లచెరువు, రొద్దం తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.



వానలోనే వెళ్తున్న వాహనదారులు


మళ్లీ మోసపోమప్పో..!

కొత్త సంక్షేమ పథకాలు అటుంచితే బాబు అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న పథకాలు ఎక్కడ నిలిపివేస్తారో అన్న భయం పట్టుకుంది. ప్రజలను నమ్మించి దగా చేయడం బాబుకు అలవాటేగా!
– గార్లదిన్నె మండలకేంద్రానికి చెందిన ఓ మహిళ నిట్టూర్పు

2014 ఎన్నికల్లో 600 పైగా హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను వంచించారు. అలాంటి వ్యక్తి నేడు మళ్లీ సిగ్గులేకుండా హామీలిస్తున్నారు.బాబును నమ్మలేం.
– కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆగ్రహం

పేదల బాగు కోసం సీఎం జగన్ పథకాలు అమలు చేస్తుంటే రాష్ట్రం శ్రీలంక కాబోతోందని విమర్శించిన వ్యక్తి.. అధికారంలోకి వస్తే అవే పథకాలు కొనసాగిస్తూ మరింత ఎక్కువ చేస్తామనడాన్ని ఎలా చూడాలి?
– రాయదుర్గం పట్టణానికి చెందిన ఓ అధ్యాపకుడి విశ్లేషణ

- చంద్రబాబు సూపర్ సిక్స్ పేరు చెబితే నవ్వుతున్న జనం
- బాబు హామీలపై వ్యంగ్యాస్త్రాలు
- గతంలో ఆయన మోసాలను గుర్తు చేసుకుంటున్న వైనం
- అధికారంలోకి వస్తే ఉన్న పథకాలు ఎత్తేస్తారని చర్చ
- ఇప్పటికే ఇంటికొచ్చి అందించే పెన్షన్లను కక్ష కట్టి నిలిపేయించారని వృద్ధుల్లో ఆగ్రహం
- బాబు అంటే మండిపడుతున్న డ్వాక్రా మహిళలు
- జనంలో వ్యతిరేకత ఉండటంతోనే టీడీపీ నాయకుల దాడులు.. ప్రలోభాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇష్టారాజ్యంగా హామీలిచ్చేసి, గద్దెనెక్కిన తర్వాత నమ్మి గెలిపించిన ప్రజలను పట్టించుకోకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ప్రజలను నిలువునా ముంచేయడం ఎలా అనే విషయం ఆయన గత చరిత్ర చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. పొరపాటున అధికారంలోకి వస్తే, ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచేసి, అన్నీ అమలు చేశానని బుకాయించడం చంద్రబాబుకు తప్ప మరెవరికీ తెలియదేమో! అందుకే బాబు నోటి నుంచి ఏది వస్తుందో అది చేయరు అన్న విషయం ప్రజల్లో నాటుకుపోయింది.

నమ్మం బాబూ..!

ఇప్పటికే చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్, సతీమణి భువనేశ్వరి కూడా ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల సభలు నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రకటించారు. అయితే, వారి మాటలు ఎవరూ నమ్మడం లేదనేది అక్షర సత్యం. ప్రస్తుతం పెన్షన్ రూ.3 వేలు ఇస్తున్నారు. తాను నాలుగు వేలు ఇస్తానన్నా కనీసం దానిపై చర్చ జరగడం లేదు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలతో టీడీపీ అభ్యర్థులు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఇల్లిల్లూ తిరుగుతున్నా, ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. దీంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. పోలింగ్‌కు మరో ఐదు రోజులే గడువుండటం, బాబు హామీలను కనీసం ప్రజలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఓటమి భయం ఎక్కువైనట్లు తెలిసింది.

గుణపాఠం చెప్పినా మారని తీరు..

2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చారు. ముఖ్యంగా రైతుల రుణమాఫీ, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి తదితర హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక వాటిల్లో ఒక్క దాన్ని కూడా సరిగ్గా నెరవేర్చిన పాపాన లేదు. దీంతోనే గత ఎన్నికల్లో ఆయనకు ప్రజలు గుణపాఠం చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ సీట్లు కట్టబెట్టి 'నిన్ను నమ్మం బాబు' అని స్పష్టం చేశారు. అయినా, గతం మరిచి నేడు మళ్లీ కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్న బాబును చూసి జనం నవ్వుకుంటున్న పరిస్థితి.

బాబు వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు!

2014–19 మధ్య కాలంలో జన్మభూమి కమిటీలను తెచ్చి పల్లెల్లో నిప్పులు పోశారని, ఏ ఒక్కరికీ లబ్ధి కలగకుండా చేశారని గ్రామీణులు ఇప్పటికీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ బాబు వచ్చి జన్మభూమి కమిటీలు ప్రవేశపెడితే తమ బతుకులు ఎంత దుర్భరంగా మారతాయోనని పేద ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి రాజకీయ సిఫార్సులు లేకుండా నేరుగా వలంటీర్లే ఇంటికొచ్చి పథకాల గురించి చెప్పి, అర్హులైన వారికి లబ్ధి చేకూర్చారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఉన్న ఊరిలోకే పాలన వచ్చింది. కానీ, బాబు వస్తే ఇవన్నీ అమలు చేయరేమోనన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నవే రాకుండా చేశారు.. కొత్తగా ఏమిస్తారు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రమారమి 5 లక్షల మంది వృద్ధాప్య, వితంతు పెన్షన్లు తీసుకుంటున్నారు. ప్రతినెలా 1వ తేదీనే ఇంటి వద్దకే వెళ్లి వలంటీర్లు డబ్బు ఇచ్చేవారు. కానీ చంద్రబాబు, ఆయన అనుంగు శిష్యులు ఎన్నికల కమిషన్ మాటున పెన్షన్లు ఇంటికి రానివ్వకుండా చేశారు. ఈ విషయంపై ఇప్పటికే వృద్ధులే కాకుండా సామాన్య ప్రజానీకం కూడా తీవ్రంగా మండిపడుతున్నారు. పెన్షనర్లకు ఎంతో సాంత్వన చేకూరుస్తున్న వ్యవస్థనే ఆపేయించిన బాబు.. కొత్తగా రూ.4 వేలు ఇస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. పెన్షన్ పెంచుతానన్న హామీతో కరపత్రాలు ఇస్తుంటే వాటిని వెంటనే చెత్తబుట్టలో వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో బాబుపై ఉన్న వ్యతిరేకతతో టీడీపీ అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో ప్రజలను భయాందోళనకు గురి చేసైనా ఎన్నికల్లో గట్టెక్కాలనే దురుద్దేశంతో, బాబు ఇచ్చిన ఆదేశాలతో పచ్చ మూకలు దాడులకు దిగుతున్నాయి. మరికొన్ని చోట్ల ప్రలోభాలకు గురి చేస్తున్నారు. అయితే, టీడీపీ కుయుక్తులను గమనిస్తున్న ప్రజలు మాత్రం ఈ ఎన్నికల్లోనూ దిమ్మతిరిగే సమాధానం చెబుతారనే విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది.

ఉన్న పెన్షన్లు తీసేస్తారు



చంద్రబాబు ఏవి చెప్పినా నమ్మడం సాధ్యం కాదు. అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ రూ.4 వేలు అంటున్నాడు. దాని అమలు కోసం అనేక నిబంధనలు పెట్టి ఉన్న పెన్షన్లు ఎన్ని ఊడిస్తాడో తెలియదు. సీఎం జగన్ రూ.3 వేలు ఇస్తున్నా క్రమం తప్పకుండా ఠంచనుగా ఒకటో తేదీనే వలంటీర్ గడప తట్టి ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. మరో రూ.500 పెంచుతానని చెప్పాడు. జగన్ చెప్పాడంటే.. చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉంది.
– మాలన్‌బీ, రాయదుర్గం పట్టణం

ఆ పాలన వద్దే వద్దు



టీడీపీకి పొరపాటున ఓటేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు కొని తెచ్చుకున్నట్టే. అప్పట్లో ఏ పథకం కావాలన్నా ఆ కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆ సమయాన వారు ప్రవర్తించిన తీరు తలిస్తేనే భయమేస్తోంది. చంద్రబాబు మానస పుత్రికగా ఏర్పాటైన ఈ కమిటీలు పేదల రక్తాన్ని పీల్చాయి. ఆ పాలన కావాలని మళ్లీ కోరుకోవడం లేదు. – నాగరాజు యాదవ్, తాళ్లకెర, గుమ్మఘట్ట మండలం

బాబుకు బుద్ధి చెప్పాలి



నాకు ప్రతి నెలా వలంటీరు ఇంటికి వచ్చి రూ.3 వేలు పింఛను ఇచ్చేవాళ్లు. బాబు తన అనుచరుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడంట. దీంతో రెండు నెలలుగా నాకు పింఛను సరిగా అందలేదు. పేదలను ఇంత ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలి. ఆయన మాటలను నమ్మితే ప్రజలు మళ్లీ కష్టాలు కొనితెచ్చుకున్నట్లే.
– దురగమ్మ, పింఛనుదారు, కంబదూరు

రేపు కళ్యాణదుర్గానికి సీఎం





హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పార్టీ నేతలు బోయ తిప్పేస్వామి, ఉమా తదితరులు

కళ్యాణదుర్గం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 9న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళ్యాణదుర్గం రానున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన మంచిని వివరించనున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తలారి రంగయ్య, శంకర నారాయణను ఆశీర్వదించాలని ప్రజలను కోరనున్నారు. సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో మంగళవారం సభాస్థలి, హెలిప్యాడ్‌లను ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నేతలు బోయ తిప్పేస్వామి, ఉమా మహేశ్వర నాయుడు, డీఎస్పీ బి.శ్రీనివాసులు పరిశీలించారు. సీఎం సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులు, అభిమానులకు అనుకూలంగా ఉండేలా పట్టణంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. కంబదూరు రోడ్డులోని ఏపీ మోడల్ పాఠశాలకు ఎదురుగా హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బాగా పనిచేస్తున్నారు.. ఇదే స్ఫూర్తి కొనసాగాలి

- అధికారులకు ప్రత్యేక సాధారణ పరిశీలకుడు రామ్‌మోహన్ మిశ్రా సూచన



మాట్లాడుతున్న ప్రత్యేక సాధారణ పరిశీలకుడు రామ్ మోహన్ మిశ్రా, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

అనంతపురం అర్బన్: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని,ఇదే స్ఫూర్తిని పోలింగ్ ముగిసే వరకూ కొనసాగించాలని ప్రత్యేక సాధారణ పరిశీలకుడు రామ్‌మోహన్ మిశ్రా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎన్నికల సంసిద్ధతపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్, పరిశీలకులతో కలిసి నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయడం ఒక ప్రత్యేక అవకాశంగా భావించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పకడ్బందీ చర్యలు: కలెక్టర్ వినోద్‌కుమార్

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని ప్రత్యేక పరిశీలకునికి కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించామన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు నిర్మించామని, 576 వీల్ చైర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. 544 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని వివరించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు: ఎస్పీ అమిత్ బర్దర్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ప్రత్యేక పరిశీకులకునికి ఎస్పీ అమిత్ బర్దర్ చెప్పారు. జిల్లాకు సరిహద్దుగా ఉన్న ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర, సమీకృత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. పోలింగ్, కౌంటింగ్ కోసం భద్రత, బందోబస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్‌నాథ్ ఝ, రవికుమార్, విలాస్ వి. షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైకోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి,ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, పార్లమెంట్ ఏఆర్‌ఓ రమేష్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'బాబు కుయుక్తుల్లో చిక్కుకున్న ఎన్నికల కమిషన్'



మాట్లాడుతున్న పైలా

తాడిపత్రి: టీడీపీ అధినేత చంద్రబాబు పన్నుతున్న కుయుక్తుల్లో ఎన్నికల కమిషన్ చిక్కుకున్నట్లుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. మంగళవారం తాడిపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ చంద్రబాబు కమిషన్‌లా మారిపోయిందన్నారు. చంద్రబాబు చెప్పినట్లు ఆడుతూ, గంగిరెద్దులా తల ఊపుతోందన్నారు. రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుంచి నిరాటంకంగా అమలవుతున్న సంక్షేమ పథకాలకు.. టీడీపీ నేతల ఫిర్యాదుతో బ్రేక్ వేయడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తూ వస్తోందని, అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి 6,95,857 మంది రైతులకు రూ. 847 కోట్లు అందకుండా చేయడం దారుణమన్నారు. అలాగే, విద్యార్థుల విద్యాదీవెన నిధులు రూ. 611 కోట్ల విడుదలను కూడా అడ్డుకోవడంతో పాటు ఆసరా, ఈబీసీ నేస్తం వంటి పథకాల అమలును నిలిపివేయడం దుర్మార్గమన్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల జీవితాలతో కూడా టీడీపీ నాయకులు చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. ఈసీ తీరు బాధ కలిగిస్తోందన్నారు. ఇళ్ల వద్దకే పింఛన్ల పంపిణీని అడ్డుకుని ఇప్పటికే లక్షలాది మంది వృద్ధులకు అవస్థలు కలిగించారన్నారు. ఎన్నికలు జరుగుతున్న తెలంగాణలో మాత్రం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అనుమతిచ్చిన ఎన్నికల కమిషన్.. మన రాష్ట్రంలో మాత్రం పథకాలు పాతవే, లబ్ధిదారులు కూడా పాతవారే అయినపుడు ఎవరికి మేలు చేసేందుకు అడ్డుకుందో ఇట్టే అర్థమైపోతోందన్నారు. కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ చర్యలు తీసుకుంటుండడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని, ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తన నిర్ణయాలపై ఈసీ పునసమీక్షించుకుని, ప్రజలకు మేలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, రైతులు, మహిళలు అధైర్యపడరాదని, ఎవరెన్ని కుయుక్తులు పన్నినా, రెండో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని మీ కేశవ్ మెచ్చుకోలేదా బాబూ?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

ఉరవకొండ: ప్రజలను ఏమార్చి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబు... గతంలో ఆయన పార్టీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ శాసనసభ వేదికగా ఆ చట్టాన్ని మెచ్చుకున్న విషయాన్ని మరిచిపోయారా? అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం వజ్రకరూరు మండలం తట్రకల్లు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చట్టం ఎంతో బాగుందని, భూములపై రైతులకు సర్వ హక్కులూ లభిస్తాయని గతంలో కేశవ్ మాట్లాడిన మాటలను మరిచి పోయారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో నేడు ఎల్లో మీడియాతో కలిసి అబద్ధాలు వల్లెవేస్తుండడం దుర్మార్గమన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు.

కేశవ్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధం...

ఉరవకొండ నియోజకవర్గ పార్ట్‌టైం ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన కేశవ్‌కు ఈ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని విశ్వ తెలిపారు. ఐదేళ్ల పాటు ప్రజలకు కన్పించకుండా పోయిన ఆయన... ఎన్నికల సందర్భంగా నేడు ప్రజల వద్దకు వచ్చి ప్రలోభాలకు గురిచేయడం, మాట వినని వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉరవకొండ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ. 2,500 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. దీనికితోడు రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు ఎన్నికల కమిషన్ సహకరించాలని విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈ విషయంలో తెలంగాణలో ఈసీ అనుమతులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

క్లుప్తంగా

గుత్తి కోటను సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు



గుత్తి కోటను వీక్షిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ విలాస్ షిండే

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని అనంతపురం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు విలాస్ షిండే అన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ అధికారి శంకర్, గుత్తి తహసీల్దార్ భారతి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌తో కలసి మంగళవారం ఆయన గుత్తి కోటను సందర్శించారు. గుర్రపు శాలలు, ఏనుగు శాలలు, చీకటి గది, రంగ మంటపం, బావులు, ముఖ ద్వారాలు, దేవాలయాలు వీక్షించారు. కోట చరిత్రను, కోటను పాలించిన రాజుల చరిత్రను గైడ్ రమేష్ వివరించారు.

నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించిన యువకుడు అనిల్‌ని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మంగళవారం ఉదయం కల్లూరు - తరిమెల క్రాస్‌లో తచ్చాడుతుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బైకుల చోరీ - ఐదుగురికి జైలు

అనంతపురం: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం ఏజేఎఫ్‌సీ న్యాయమూర్తి ప్రతిభ తీర్పు వెలువరించారు. అనంతపురం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు అపహరించిన కేసులో జి.అశోక్ (అనంతపురం), ఎస్.అస్లాంబాషా (నారాయణపురం పంచాయతీ), జయరాములు , తలారి బాబు (కళ్యాణదుర్గం), కె.సురేష్ (గరుడాపురం) నిందితులు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సుచరిత వాదనలు వినిపించారు.

26న బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 550కు పైగా మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని బలిజ విద్యార్థులకు ఈ నెల 26న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు టి.శంకరయ్య, కార్యవర్గ సభ్యులు మంగళవారం వెల్లడించారు. పూర్తి వివరాలకు 98664 19693, 92477 92567, 94901 80177లో సంప్రదించవచ్చు.





వజ్రకరూరులో ప్రచారం చేస్తున్న అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఆత్మకూరు మండలం వేపచెర్ల దిగువతండాలో అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఊరేగిస్తున్న దృశ్యం, యాడికి మండలం రాయలచెరువులో రోడ్డు షో నిర్వహిస్తున్న అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఫ్యాన్ గుర్తు మరవొద్దు

ఎన్నికల పోలింగ్ దగ్గర పడడంతో ప్రచారాన్ని అభ్యర్థులు ముమ్మరం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు చుట్టి వచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఓ వైపు ఎండలు మండుతున్నా... అదే స్థాయిలో ప్రచారాన్ని కొనసాగించారు. అవ్వా మన గుర్తు ఫ్యాన్... తాతా మన గుర్తు ఫ్యాన్. అక్కా ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి. అన్నా ఫ్యాన్ గుర్తు మరవొద్దు అంటూ ఓటు అభ్యర్థిస్తూ ముందుకు సాగారు.

– సాక్షి బృందం:




అనంతపురం 39వ డివిజన్‌లో ఓటు అభ్యర్థిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, గుంతకల్లు మండలం అయ్యవారిపల్లిలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న అభ్యర్థి వైవీఆర్



శింగనమల సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, పక్కన ఎంపీ అభ్యర్థి ఎం.శంకరనారాయణ, శైలా నరసింహయ్య తదితరులు

జేసీకి భంగపాటు తప్పదు

- యాడికి బహిరంగసభలో ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి




యాడికిలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, బహిరంగ సభకు హాజరైన ప్రజలు

యాడికి: ఈ ఎన్నికల్లో జేసీ ప్రభాకరరెడ్డికి భంగపాటు తప్పదని, ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డి ఓటమి ఖాయమని పలు సర్వేలు చెబుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎం.శంకరనారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం యాడికిలో భారీ రోడ్డు షో నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో వారు ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో అస్మిత్ రెడ్డి ఓడిపోతే తాను ఊరు విడిచి వెళ్లిపోతానంటూ అనుచరులతో ప్రభాకరరెడ్డి చెప్పుకున్నారని, కనీసం ఈ ఒక్క మాటపైనన్న నిలబడి ఎన్నికల ఫలితాలు వెలువడగానే మూటముల్లె సర్దుకుని ఊరు విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 35 ఏళ్లుగా తాడిపత్రి నియోజకవర్గంలో నియంతలా రాజకీయం చేసిన జేసీ సోదరులు నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. జేసీ సోదరుల హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా రక్త పుటేరులు పారించారన్నారు. హత్యా రాజకీయాలు, వర్గ కక్షలు ప్రేరేపించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం నెలకొందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే యాడికి మండలంలోని పిన్నేపల్లె చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలో చేనేత రంగం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగతి బ్రహ్మానందరెడ్డి, సీజేఎస్ ఇన్‌చార్జ్ శివప్రసాద్ పాల్గొన్నారు.

నగేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకరనాయక్



నగేష్‌ను పరామర్శిస్తున్న వడిత్యా శంకరనాయక్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా కేంద్రంలో ఎరికల నగేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకరనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురానికి విచ్చేసిన ఆయన స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేష్‌ను పరామర్శించారు. దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. నగేష్ కుటుంబానికి ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందన్నారు. కేసు దర్యాప్తును పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చేసినప్పుడే మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున నాయక్, సాకే చిరంజీవి, సాకే ఆనంద్, రాజు నాయక్, హనుమంతు నాయక్, మురళి, సాయి, పెద్దన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాదిగల ద్రోహి మందకృష్ణ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబిలేసు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: మాదిగల ఆత్మాభిమానాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన మందకృష్ణ... మాదిగల ద్రోహిగా మారాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు ధ్వజమెత్తారు. మంగళవారం అనంతపురంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలు తన వెంటే ఉన్నారని గొప్పలు చెప్పుకుంటున్న మందకృష్ణ మాదిగ వైఖరిని తప్పుబట్టారు. మాదిగలకు న్యాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీలు కలిసికట్టుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మంద కృష్ణయ్య, నాగరాజు, ముత్యాలు, సూరి, జె.ముత్యాలు, ఆదిశేషు, గురుశంకరనారాయణ, చదువు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి



జస్టిస్ ఈశ్వరయ్యను సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

అనంతపురం కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగుల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఓ హోటల్‌లో అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యను బీసీ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించారన్నారు. కావున ప్రతిఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ ఆల్బైన్‌రాజు, బీసీ సంఘం ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ భాస్కర్ బాబు, బీసీ సంఘాల నాయకులు రజక అనిల్‌కుమార్, వాల్మీకి హరి, లక్ష్మీనారాయణ, రామ్మోహన్ గౌడ్, బెస్త వెంకటేష్, వాల్మీకి నగేష్, శివ, కురుబ విష్ణువర్ధన్, తేజ, వంశీ, బాలాజీ, టీసీ నాగేంద్ర, లబ్బే రాఘవ, బోనాల రఫి పాల్గొన్నారు.

బెదిరింపు కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు

బొమ్మనహాళ్: మండల సాక్షి దిన పత్రిక విలేకరి పి.అనిల్‌కుమార్‌కు కొందరు టీడీపీకి చెందిన యువకులు మంగళవారం ఫోన్ చేసి బెదిరించారు. దుర్భాషలాడుతూ అంతు చూస్తామని పదేపదే ఫోన్ కాల్స్ చేశారు. దీంతో తనకు, తన కుటుంబసభ్యులకు టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందంటూ బాధితుడు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి



వెంకటేష్‌ను తరలిస్తున్న దృశ్యం

గుంతకల్లు: కదులుతున్న రైలు నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడిన ఘటన వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. వివరాలు... కర్ణాటకలోని వాడి ప్రాంతానికి చెందిన వెంకటేష్... బెంగళూరులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు మంగళవారం బెంగుళూరు నుంచి నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో వాడికి బయలుదేరాడు. కల్లూరు–గుంతకల్లు సెక్షన్‌లోని వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ దాటి సుమారు 5 కి.మీలు ప్రయాణించిన తర్వాత బాత్రూంకు వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుంచి వెంకటేష్ జారి కిందపడ్డాడు. ఘటనలో తలకు, కాళ్లకు బలమైన రక్తగాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న గ్యాంగ్‌మెన్‌లు ఈ విషయాన్ని గుర్తించి వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ మాస్టర్‌కు సమాచారం చేరవేశారు. స్టేషన్ మాస్టర్ నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

నయ వంచకుడు చంద్రబాబు

- సంక్షేమ పథకాలు ఆపేయాలని ఈసీకి ఫిర్యాదు చేయడం దుర్మార్గం
- ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీ విత్తనాన్ని అడ్డుకున్న ద్రోహి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు



మాట్లాడుతున్న మెట్టు, చిత్రంలో ఎంఆర్‌సీ రెడ్డి

రాయదుర్గం: పేదలను అణచివేయడమే టీడీపీ అధినేత చంద్రబాబు ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, పార్టీ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి మండిపడ్డారు. స్థానిక మెట్టు నివాసంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డితో కలసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలను ఆపేలా ఈసీకి చంద్రబాబు ఫిర్యాదు చేయించి పైశాచిక ఆనందం పొందుతున్నాడన్నారు. 58 నెలలుగా అమలులో ఉన్న వివిధ పథకాలను కేవలం ఎన్నికల దృష్ట్యా ఆపితే పేదలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఈసీ ఆంక్షలు లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా 6,95,857 మంది రైతుల ఖాతాల్లో రూ.847.22 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయి ఉండేదన్నారు. తొలకరి వర్షాలు కురిసే సమయాన రాయితీ విత్తనాన్ని సైతం అడ్డుకునే దుర్మార్గమైన ఆలోచన ఎంత నీచమైందో ఇప్పటికైనా ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు చెందిన విద్యా దీవెన నిధులు రూ.610.79 కోట్లు జమ కాకుండా అడ్డుకున్న నారాసురుడికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు వైఖరి కారణంగా ఉన్నత చదువులు అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులయ్యే పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ ఫిర్యాదులపై ఈసీ పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పుడే చంద్రబాబు తీరు ఇలా ఉంటే రేపొద్దున అధికారంలోకి వస్తే ఈ పథకాలను శాశ్వతంగా రద్దు చేయడని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉంటూ ఐదేళ్లు రాయదుర్గం అభివృద్ధిని పట్టించుకోని కాలవ శ్రీనివాసులు ఓటమి ఖాయమైందన్నారు. ఈ నెల 9న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్కేయూకు రూ.18.97 కోట్ల అదనపు నిధులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అదనపు బ్లాక్‌గ్రాంట్ కింద రూ.18.97 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జూలై వరకూ వర్సిటీ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించడానికి వీలుగా అదనపు బ్లాక్‌గ్రాంట్ నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి సుభాష్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఈ మొత్తాన్ని కేటాయించారు.

నా మంచితనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు

- టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వార్నింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: 'రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌కు చోటు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రజల కోసం ఎన్నో సార్లు తల దించుకున్నా. అయినా టీడీపీ నాయకులు రెచ్చగొడుతూనే ఉన్నారు. గ్రామాల్లో మళ్లీ కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. నా మంచితనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు' అంటూ టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిటాల సునీత కేవలం అధికారం, పదవి కోసమే రాజకీయాలు చేస్తున్నారని, ఇక్కడ టికెట్ రాదన్న భయంతో ధర్మవరం, పెనుకొండలోనూ టికెట్ కోసం ప్రయత్నించారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేయడం, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం పరిటాల కుటుంబానికి తెలియదన్నారు. స్థానికుడినైన తన నరనరాల్లో నియోజకవర్గ ప్రజలపై ప్రేమ ఉందన్నారు. ఓడినా... గెలిచినా తాను ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.50 కోట్ల తన సొంత డబ్బు వెచ్చించినట్లు గుర్తు చేశారు. ప్రజా సేవ చేయడంలో తన కాలి గోటికి కూడా పరిటాల కుటుంబం సరితూగదన్నారు. ఓటమి తప్పదని తెలుసుకున్న పరిటాల కుటుంబం చివరకు రంగంలో రౌడీ మూకలను దించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏమైనా జరిగితే ఆ రౌడీలను ఊర్లు విడిపిస్తానని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకుల పిలుపు



మాట్లాడుతున్న కేవీ రమణ, కొర్రపాడు హుస్సేన్‌పీరా తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా వాసులను వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ, జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, కార్మికులకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఉద్యోగులకు జీతాలు అందించారని, 27 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మునిసిపల్ ఉద్యోగులు అడగక ముందే వారి జీతాలు పెంచారని గుర్తు చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు నడపడంతో చంద్రబాబును మించిన వారు లేరని మండిపడ్డారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, నాయకులు కె.సూర్యనారాయణ రెడ్డి, కె.గోవిందు పాల్గొన్నారు.

శిశుగృహలో ఉద్యోగుల మాటల యుద్ధం

అనంతపురం సెంట్రల్: అనాథ పిల్లల సంరక్షణకు మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నెలకొల్పిన శిశుగృహ వివాదాలకు కేంద్రంగా మారింది. అక్కడ పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆదాయమే పరమావధిగా ఆధిపత్య పోరుకు తెరలేపారు. అనాథ శిశువుల ఆలనాపాలన చూస్తున్న హెల్పర్లపై దౌర్జన్యాలకు దిగుతుండడంతో తామిక్కడ పని చేయలేమంటూ పలువురు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. తాజాగా మంగళవారం వివాదం కాస్త తారాస్థాయికి చేరుకుని రచ్చకెక్కింది. చిన్నారుల సంరక్షణను గాలికొదిలేసి మాటల యుద్ధానికి తెరలేపారు. పరస్పరం బూతులు తిట్టుకున్నారు. ఇది కాస్త చర్చనీయాంశమైంది. జరిగిన ఘటనపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్)

■ ఇంటర్ Any గ్రూప్ పాస్ స్టూడెంట్స్‌కి DMLT (బ్లడ్ టెస్ట్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్, (ఫ్రీ ఎడ్యుకేషన్) హాస్టల్ వసతి కలదు. సంప్ర : జి. మురళీ, 9030661651, అనంతపురము. [A-784629]

ADMISSIONS

■ R.R. క్రిష్టియన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కర్నూలులో B.Sc(N), P.B.B.S.C(N)/ GNM (స్టాఫ్ నర్స్) & MSRR కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి, కర్నూలులో (ఫిజియోథెరపి డాక్టర్) కోర్స్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కొరకు సంప్ర: 94402 89937 [L-795784]

WANTED

■ ప్రణవ్ ప్రాపర్టీస్ నందు పనిచేయుటకు టీమ్ లీడర్స్, సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, మేనేజర్స్, యువతీయువకులు ఫ్రెషర్స్, హౌస్‌వైఫ్స్, LIC ఏజెంట్స్ కావలెను. 9100501490. [A-784631]

■ మీ ప్రాంతంలో పనిచేయుటకు టీచర్స్ కావలెను. ఉచిత ట్రైనింగ్ ఇవ్వబడును. ఎటువంటి రుసుము లేదు. Whatsapp. 7013518449. [G-8793]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185066]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గంటలు డ్యూటీ, మగవారు మాత్రమే. జీతం: 13,000/-. వివరములకు సంప్రదించండి : 7288 004466. [NA-11695]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K. Ph: 9640400073, 9160900024. [HA-100]

■ ప్రముఖ ఎయిర్‌పోర్టులో పనిచేయుటకు లోడింగ్ సూ॥వైజర్స్, హౌస్ కీపింగ్ సూ॥వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/-, రూమ్+భోజనం ఫ్రీ. ఫోన్: 9642261084 [H-788085]

■ ప్రముఖ బ్యాంకులలో పర్మినెంట్‌గా కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ కా॥ Q: 10th-డిగ్రీ జీ॥ 28000/-. ఫోన్: 7981652556. [H-801617]

■ రూట్స్ పబ్లిక్ స్కూల్ నందు బోధించుటకు నర్సరీ to 10th Class వరకు All Subjects టీచర్స్ కావలెను & హాస్టల్ వార్డెన్స్ కావలెను # రాచానపల్లి, GNR వనం, అనంతపురము. Cell: 9908433610, 9494931475. [A-1988]

■ ఆడిటర్ వద్ద TALLY+కంప్యూటర్ వచ్చిన B.Com వారు బయోడేటాతో రావలెను. 08-05-2024 @ 11 AM to 6 PM. శాలరీ : 8 వేలు. # రామ్‌నరేష్ ఫంక్షన్ హాల్, H.B. కాలనీ రోడ్డు, ATP. 9533764777. [A-784632]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ కొరకు అనుభవజ్ఞులైన మార్కెటింగ్ సిబ్బంది కావలెను. టీమ్ తో సహా వచ్చిన వారికి & హౌసింగ్ ప్రాజెక్ట్స్ నందు మార్కెటింగ్ చేయువారికి ప్రాధాన్యత. ప్రతి ఒక్క మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు ఖచ్చితమైన జీతం. ప్రారంభ వేతనం : 12,000 to 15,000. సంప్ర : 9989452444. [A-1982]

■ కావలెను. ఎలెక్ట్రిసిటీ మీటర్లకు డోర్ టు డోర్ సర్వే చేయుటకు, కస్టమర్ డేటా ఎంటర్ చేయుటకు 18-35 సం॥. వయస్సు గల స్త్రీ/ పురుషులు కావలెను. అర్హత : 10th & above ఇంగ్లీష్ వ్రాయడం, చదవడం అవసరం. # జెస్టిక్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్. సెల్ : 9014981414, 9916667557, 9059451164. [A-1987]

■ Immediate Requirement Ananthapuram City, Counsellors, Telecallers, Administrative officers, Office Assistants in Ananthapuram (Male / Female) Salary best in the Field (10,000 - 30,000) Freshers & Experienced both Can Apply. Ph: 9160846846. [HA-67]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే సంక్షేమం


ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం


రాప్తాడు: హంపాపురం రోడ్డుషోలో పాల్గొన్న ప్రజలు

- ఎన్నికల ముందు హామీలివ్వడం.. మోసం చేయడం బాబుకు అలవాటే
- అధికారం కోసమే టీడీపీ ఆరాటం
- ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలివ్వడం.. ఎన్నికల తరువాత మోసం చేయడం టీడీపీ నైజమని ఎమ్మెల్యే తోపుదుర్తి పర్కాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేపచెర్ల, వేపచెర్ల ఎగువ తండా, వేపచెర్ల దిగువ తండా, బి.యాలేరు గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వర్థ్ నాయక్, కురుబ మహిళా సంఘం అధ్యక్షురాలు శివబాలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి హారతులు పట్టి.. పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో క్రేన్‌లతో పెద్ద పెద్ద గజమాలలు వేశారు. అనంతరం ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. అధికారంలో కోసం చంద్రబాబు నాయుడు ఎన్నో అమలు కాని అబద్ధపు హామీలను ప్రజలకు ఇస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టోలో రూ.4 వేల పింఛన్ ఇప్పుడు వారి కరపత్రాల్లో కనపడటం లేదని విమర్శించారు. గతంలో డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగనన్న పేరు చెబితే ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయని పేర్కొన్నారు. చంద్రబాబు పేరు చెబితే దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏమి గుర్తు రావని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పేరు చెబితే కరువు తప్ప ఏమి గుర్తుకు రాదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి సమాధి కడతామన్నారు.

దోచుకోవడమే పరిటాల లక్ష్యం..

ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా సునీత రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని తెలిపారు. నీరు–చెట్టు ద్వారా వేల కోట్లు టీడీపీ నాయకుల ద్వారా దోచుకున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో అన్ని చెరువులకు దాదాపు 40 నెలలు నీరు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల రావడంతో గ్రామాల్లో కుల రాజకీయాలు చేస్తూ వారి పార్టీ నాయకులు, కార్యకర్తలకే కండువాలు వేస్తూ ఆనందపడుతున్నారని తెలిపారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా, ఎంత మంది అడ్డుపడ్డా ఈ సారి రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కాంతమ్మ, రేణుకమ్మ, లక్ష్మీదేవి, నరసింహ, లక్ష్మీనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, ఎంపీటీసీలు వరలక్ష్మి, లక్ష్మీదేవి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బాలపోతన్న, వాసుదేవ రెడ్డి, ఈశ్వరరెడ్డి, కృష్ణానాయక్, సుధీర్‌రెడ్డి, చిన్నారెడ్డి, రవినాయక్, జగదీష్ నాయక్, ఎర్రిస్వామి, మహేష్, నరసింహారెడ్డి, యల్లప్ప, లక్ష్మీనారాయణ, గంగాధర్‌రెడ్డి, మహేష్, పరిగిరెడ్డి, లోకేష్, నవీన్‌కుమార్, శివకుమార్, షషి, గవ్వనల్లప్ప, ఈశ్వరయ్య, మనేరు ఈశ్వరయ్య, ముదినేపల్లి నరసింహులు, రంగనాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే ముంచేస్తాడు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: మోసం, దగా, వంచనకు కేరాఫ్ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబును నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచేస్తారన్నారు. మంగళవారం మండలంలోని హంపాపురం, చాపట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారుతాడని ఆరోపించారు. 2014లో ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేశాయన్నారు. అప్పట్లో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తర్వాత వాటిలో ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఏకంగా ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో కనపడకుండా చేశారని గుర్తు చేశారు. 2024 ఎన్నికలకు సంబంధించి టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో అమలు సాధ్యం కాదని గ్రహించిన బీజేపీ నాయకులు మేనిఫెస్టో కాపీలను ముట్టుకోవడానికి కూడా ఇష్టపడటం లేదన్నారు. దీన్ని ప్రజలంతా గమనించాలన్నారు. 2014లో డ్వాక్రా రైతు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు, పరిటాల సునీత మోసం చేశారని, మళ్లీ అదే తరహాలో ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ మోసం చేసేందుకు చూస్తున్నారని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి రాప్తాడు ఎమ్మెల్యేగా తనను, హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను త్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ ఆగ్రోస్ కేశవ రెడ్డి, ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సొసైటీ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, కురుబ సంఘం నాయకురాలు శివబాల, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, మండల కన్వీనర్ శేఖర్, బీసీ సెల్ నాయకుడు ఆది, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకులు పెద్ద కేశవ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, రాజారెడ్డి, వెంకట నారాయణ, మధుసూదన్ రెడ్డి, చుక్కా సంజీవ రాయుడు, సింగారప్ప, సూర్యనారాయణ రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 39వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'


వడ్డే కాలనీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: 2014 ఎన్నికలకు ముందు 'రావాలి జగన్ కావాలి జగన్' కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లాను. ప్రజల విజ్ఞప్తి మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నగరంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేశాం. మరోసారి అవకాశం ఇస్తే రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేసి తీరుతామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ వడ్డే కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మధ్య పథకాలు వచ్చేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 85 సచివాలయాల్లో 500లకు పైగా సేవలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఏదైనా సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా ఇంటి వద్దకే పాలననందిస్తున్నట్లు గుర్తు చేశారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయాల ద్వారా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సంక్షేమం రూ.2,304 కోట్లు, అభివృద్ధి రూ.1,045 కోట్లు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రూపు రాజకీయాలతో అభివృద్ధిని విస్మరించారన్నారు. ఇప్పుడున్న టీడీపీ అభ్యర్థి హత్య కేసులో నిందితుడన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో తన అనుచరులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రోత్సాహంతో ఆయన అనుచరులు అనంతపురం రూరల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుజ్జల నగేష్‌పై హత్యయత్నం చేశారన్నారు. ఇటువంటి వారు అధికారంలోకి వస్తే దౌర్జన్యాలు, దారుణాలు, అక్రమాలు పెట్రేగిపోతాయని తెలిపారు. మేధావులు, యువత, తదితరులు ముందుచూపుతో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, రాధాకృష్ణ, ఖాదర్ బాషా, ఓబుళపతి, వడ్డే బంగారప్ప, భూమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఏ1 రఫి, ఆర్వేసురేష్, హిదయతుల్లా, నీలూరు సురేష్, సన్నీ, రఫి, తనీష, శీన, భాస్కర్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి


29వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ వసీం


రుద్రంపేటలో ఓటు అభ్యర్థిస్తున్న అనంత మాలతి


5వ డివిజన్‌లో పథకాలు వివరిస్తున్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ జయలలిత

అనంతపురం కార్పొరేషన్: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 29వ డివిజన్‌లో మేయర్ వసీం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. స్థానిక కార్పొరేటర్ సైపుల్లాబేగ్, నాయకులు జావిద్, మహబూబ్‌బాషా, ఖాదర్ బాషా, జాకీర్, సాధిక్, రఫి, షకీర్, హుస్సేన్ పీరా, రాజు, జిలాన్, అమ్ము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనంతను ఆశీర్వదించండి

నగరానికి ధీటుగా పంచాయతీలను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కోరారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీలో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రుద్రంపేట పంచాయతీలో రూ.41 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అనంత, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబీకులు అనంత మాలతీ, అనంత సువర్ణ, అనంత నవ్యత రెడ్డి, అనంత మేఘన, అనంత లిఖిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలలతో స్వాగతం పలికారు.

ఉత్సాహంగా కార్పొరేటర్ల ప్రచారం

నగరంలోని అన్ని డివిజన్లలో ఆయా కార్పొరేటర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలనాగిరెడ్డి, అంకిరెడ్డి ప్రమీల, గంపల్, గద్దం ప్రభాకర్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాపంపేటలో హోరెత్తిన ప్రచారం


ప్రచారం చేస్తున్న తోపుదుర్తి మనోరమ రెడ్డి

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో మంగళవారం ఎమ్మెల్యే సతీమణి తోపుదుర్తి మనోరమరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలిస్తే పేదలు మరింత అభివృద్ధి చెందుతారని వివరించారు. పథకాలు కొనసాగాలంటే జగనన్నను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాప్తాడులో రెండోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ, పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, చిన్నమాదన్న, సుబ్బిరామిరెడ్డి, రాజగోపాల్, లాలెప్ప, గోపి, షామీర్ తదితరులు ఉన్నారు.

ముస్లిం, మైనార్టీలను కించపరిస్తే సహించం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల నగరంలో జరిగిన టీడీపీ ప్రజాగళం సభలో టీడీపీ నాయకులు ముస్లిం మైనార్టీలను కించపరిచే విధంగా మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటుతో బుద్ధి చెబుతామని వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీంను టీడీపీ నాయకులు వ్యంగ్యంగా మాట్లాడారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రూపు రాజకీయాలతో అభివృద్ధి మరుగునపడిందన్నారు. ముస్లిం మైనార్టీలందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుల్జార్‌పేట్ షేక్‌ఖాజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ నియాజ్, నాయకులు వేమల నదీం, మన్సూర్, నిజాం, జేఎం బాషా, అలీం, కమర్‌తాజ్, షేక్ మునీరాబేగం, దాదు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన సంతోష్ నాయక్


తోపుదుర్తి చందు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వడ్డే సురేష్

ఆత్మకూరు: మండలంలోని పలువురు టీడీపీ నాయకులు మంగళవారం ఆ పార్టీని వీడారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వేపచెర్ల ఎగువ తండాకు చెందిన రమేష్ నాయక్, సంతోష్ నాయక్ వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే మండలంలోని సనప గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డే సురేష్ వైఎస్సార్‌సీపీలో చేరాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చందు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపునకు,పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

పిల్లిగుండ్ల కాలనీలో జోరుగా ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ జరిగిన లబ్ధిని వివరించారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరారు. పరిటాల సునీత పదేళ్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండికూడా చేయలేని అభివృద్ధి పనులను తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత చేసి చూపించారన్నారు. కక్కలపల్లికాలనీ పంచాయతీలో ప్రతి వీధి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన పీఏబీఆర్ నీళ్లు తెప్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ సుకుమార్, వార్డు సభ్యులు రామస్వామి, గౌస్‌మొహిద్దీన్, నాగేంద్ర ప్రసాద్, నాయకులు చిన్నపరెడ్డి, రమేష్, మైకేల్ ప్రసాద్, సుంకన్న, అంజి, రఫి, లాలూసాబ్, కార్పెంటర్ నాగరాజు, వెంకీ, సూరియాదవ్, వలీసాబ్, అన్సర్, రామ్మోహన్, వేణుగోపాల్, రాములమ్మ, ప్రేమకుమార్ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


హరియాన్ చెరువులో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని హరియాన్ చెరువు, యర్రంపల్లి, దామాజిపల్లి, నాగసముద్రం, బసినేపల్లి, ప్యాదిండి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతూ మరిన్ని పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని సూచించారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలు నమ్మి మోసపోవద్దన్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డికి గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. అనంతరం రామగిరి మండలం కొండాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి, కురుబ ఆనంద్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వెంకటాంపల్లికి చెందిన శివారెడ్డి, చాకలి రాజప్ప, చాకలి రవి, హరిజన అంజి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పాస్టర్లు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు'

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న పాస్టర్లకు గౌరవ వేతనం అందించిన ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటామని జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం పలు ప్రార్థనా మందిరాల్లో సంఘం హర్షం వ్యక్తం చేశారు. పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు మాట్లాడుతూ.. క్రైస్తవులందరూ ఏకమై మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపికుంటామన్నారు. అలాగే అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని, రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జీఆర్ ఆనంద్, మనుష్యే, మార్కు, రూఫస్ కుమార్, శాంత వర్ధన్, జహంగీర్ జాషువా తదితరులు పాల్గొన్నారు.

రుణాల రెన్యూవల్‌కు రైతుల అవస్థలు

కనగానపల్లి: ఖరీఫ్ పంట రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మామిళ్లపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రైతుల ఆధార్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకం నకలు, వన్‌బీతో పాటు అన్ని సర్వే నంబర్లకు అడంగల్ కాపీలు తీసుకుని రావాలని నిబంధనలు పెట్టారు. వీటికి తోడు జామీనుదారుల సంతకాలు, హామీ పత్రాలు, బీమా పాలసీలంటూ బ్యాంకు అధికారులు తిప్పుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఇక ఈ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గంటల కొద్ది బ్యాంకులో వేచి ఉన్నా పనులు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా రుణాలు రెన్యూవల్ చేయాలని జిల్లా రైతు సంఘం కార్యవర్గ సభ్యుడు మహదేవ్, సంఘం నాయకులు బాలరాజు, మల్లికార్జున బ్యాంకు బ్యాంకు మేనేజర్ ప్రదీప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రకాష్‌రెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించుకుందాం


మాట్లాడుతున్న తోపుదుర్తి నయనతారెడ్డి

ఆత్మకూరు: ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఐదు సంవత్సరాలు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు డబ్బు, మద్యం కోసం పని చేస్తే.. మనం ప్రతి ఒక్కరు ప్రకాష్‌రెడ్డి గెలుపునకు నిస్వార్థంగా పని చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి తెలియజేశారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆత్మకూరు యువ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన అభివృద్ధి, మంచి పనులు, సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇప్పటికే ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించామని వెల్లడించారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని.. యువత అనుకుంటే సాధించలేనిది ఏది లేదన్నారు. టీడీపీ నాయకులు వారి కార్యకర్తలకే కండువాలు వేసుకుని మరి కొందరికి డబ్బు, మద్యం ఆశ చూపి ప్రలోభాలకు గురి చేసి తమ పార్టీ బలపడిందని శునకానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. బీఎల్ఏలు ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండా రెడ్డి, నాయకులు శ్రీధర్, కాయగూరల ముత్యాలు, సద్దికూటి శివారెడ్డి, నాగరాజు, చెన్నారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి, జయచంద్రా రెడ్డి, తరుణ్, కబాబ్ ఎర్రిస్వామి, నరేంద్ర, మురళి, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్, ఓబీ టైలర్ వెంకటేష్, రామాంజి, కల్యాణ్, అశోక్, ప్రసాద్, నాగేంద్ర, ఉజ్జినప్ప, వెంకట్‌రెడ్డి, కొండారెడ్డి, నర్రేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలంలో నేడు ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ, సనప, రంగంపేట, తోపుదుర్తి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మామిడి తోట కంచెకు నిప్పు


కూడేరు: మండలంలోని కమ్మూరుకు చెందిన రైతు నరేష్ మామిడి తోట కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సర్పంచ్ చిన్న రంగారెడ్డి, స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్‌తో మంటలు ఆర్పేశారు. అయితే అప్పటికే సుమారు 40 మామిడి చెట్లు కాలిపోయాయి.

ఈదురు గాలులకు దెబ్బతిన్న మామిడి తోటలు


చుక్కలూరులో ఈదురు గాలులకు రాలిన మామిడి కాయలు

తాడిపత్రిటౌన్: మండలంలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చిన్నపోలమడ, పెద్దపోలమడ, ఇగుడూరు, గంగాదేవిపల్లి, చుక్కలూరు గ్రామాల్లో మామిడి, అల్ల నేరేడు పంటలు దెబ్బతిన్నాయి. రూ. లక్షల్లో నష్టపోయినట్లు రైతులు కిట్టా, మేమనాథరెడ్డి, నాగరాజు, రామాంజి, బలరాముడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

డీఎస్పీ ప్రతాప్ కుమార్ బాధ్యతల స్వీకరణ



అనంతపురం: అనంతపురం అర్బన్ డీఎస్పీగా టీవీవీ ప్రతాప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు సీఐలు, పోలీస్ అధికారులు నూతన డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి శంకర జయంత్యుత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని శృంగేరీ శారద శంకర మఠం వేదికగా ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ జగద్గురు ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు మఠం ప్రతినిధి సత్యప్రసాద్ మంగళవారం తెలిపారు. 8న పంచలోహ విగ్రహాలకు మండల పూజలు, తర్వాత మూడురోజుల పాటూ గణపతి హోమం, పుణ్యహవచనం, మండల పూజ అనుసంధాన హోమాలు జరుగుతాయన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్

రాప్తాడు: పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం 549 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆత్మకూరు మండల తహసీల్దార్, ఎన్నికల నోడల్ ఆఫీసర్ పరమేశ్వరరావు తెలిపారు. మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డులోని టీటీడీసీ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727

సీఎం జగన్‌కు అండగా నిలవండి

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


అయ్యవారుపల్లిలో మహిళలతో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి, సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మండలంలోని అయ్యవారుపల్లి, కదిరిపల్లి, గుర్రబ్బాడు, ఇమాంపురం, నాగసముద్రం గ్రామాల్లో ప్రచారాన్ని చేశారు. ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వైవీఆర్‌కు ప్రజలు అడుగడుగునా హారతులు పడుతూ పూలమాలలతో స్వాగతం పలికారు. ఎన్నికల్లో విజయం సిద్ధించాలని కోరుకుంటూ ఎమ్మెల్యే వైవీఆర్‌తో కలిసి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలులో జన్మభూమి కమిటీలు అడుగడుగునా అడ్డుపడి నిరుపేదల ఉసురుపోసుకుంటే, జగన్ ప్రభుత్వంలో అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను చేర్చిన విషయం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్‌సీపీకి ప్రజలు మద్దతుగా నిలిచి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యం కాని హామీలను ఆశగా చూపి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో మరోసారి సిద్ధం అయ్యారని, వారి మాయలో పడకుండా ఓటుతో వారికి బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిన తనను మరోసారి ఆదరించాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్


తట్రకల్లులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేఅభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి


ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

పయ్యావులను ఇంటికి సాగనంపండి

● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి
● గ్రామాల్లో రోడ్‌షోకు అపూర్వ స్పందన

వజ్రకరూరు: ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపించే పయ్యావుల కేశవ్‌ను ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలం తట్రకల్లు, గంజికుంట, వజ్రకరూరు, బోడిసానిపల్లి, బోడిసానిపల్లితండా తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ముందుగా తట్రకల్లు గ్రామానికి చేరుకున్న విశ్వన్నకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్ షో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం గంజికుంట, వజ్రకరూరు, బోడిసానిపల్లి, బోడిసానిపల్లి తండా తదితర గ్రామాల్లో విశ్వేశ్వరరెడ్డి రోడ్ షో నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజలకు కనిపించకుండా, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నగరాల్లోనే ఉంటారన్నారు. అలాంటి వ్యక్తికి ఎన్నికల్లో బుద్ధిచెప్పి ఇంటికి సాగనంపాలని కోరారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబును కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేవాడినన్నారు. సీఎం వైఎస్ జగన్ ఉరవకొండకు వచ్చిన సమయంలో రూ.200 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సీపీ వీరన్న, వెంకటరెడ్డి, విశ్రాంత వీఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుశీలారాణి, మో సాలిసా, సుధీర్‌రెడ్డి, రామానాయుడు, రవికాంత్‌రెడ్డి, ఉస్మాన్, మాసినేని నరేష్, సందీప్‌రెడ్డి, వశికెర రమేష్, వీరభద్రగౌడ్, డిష్ సురేష్, రామకృష్ణ, రామాంజనేయులు, ఆవుల వెంకట్రాముడు, నల్ల బోతులరాజు, రాకెట్లబాబు, అచ్చనాలమధుసూదన్, వైద్యనాథరెడ్డి, నెట్టికల్లు, జిరాక్సు శివ, భాస్కర్, గాలిమిషన్ వీరభద్ర, జయరమేష్, శంకర్, కిష్టన్న, సూర ప్ప ,శ్రీనివాసులు, సుధాకర్, చంద్రశేఖర్, బసవరాజు, వీరేష్, సుశీలమ్మ, సుంకమ్మ, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, మల్లిరెడ్డి, భజనశంకర్, కిష్టప్ప, రాజన్న, నాగేంద్ర, వెంకటేష్, హు మాయూన్, రఘుపతి, రమేష్, సికిందర్, సునీల్, బలరాముడు, ధనుంజయ, వెంకటేశ్వరరెడ్డి, ఖాజాపీరా, నాగరాజు, ప్రభుదాస్, నల్లబోతుల కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి


జీ.కొట్టాలలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి

గుంతకల్లు రూరల్: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి మంచి మనసుతో ఆశీర్వదించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని జీ.కొట్టాల గ్రామంలో ఆమె వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతితో కలిసి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చింబిలి భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైవీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి


ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకరనారాయణలను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని కోరారు. మంగళవారం పట్టణంలోని 28, 32 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. జగనన్న ప్రకటించిన నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే వైవీఆర్ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ గెలుపే.. పేదల గెలుపు


జీ.కొట్టాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు రూరల్: జగనన్న గెలుపే పేదల గెలుపు అని, అందుకే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వై.భీమలింగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మండలంలోని జీ.కొట్టాల ఎస్సీ కాలనీలో ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా శంకర నారాయణను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ


లోకసాయి చరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తికి చెందిన వారధి లోకసాయి చరణ్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. జూనియర్స్ విభాగంలో ఏపీ తరుపున విద్యార్థి ప్రాతినిధ్యం వహించి మూడో స్థానం సాధించాడు. విద్యార్థిని తైక్వాండో మాస్టర్ రంగ వినీత్, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రమేష్ బాబు తదితరులు అభినందించారు.

అతిసారం బాధితులకు పరామర్శ


అతిసార బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన దాదాపు 20 మంది అతిసారం బారిన పడి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ మంగళవారం ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలన్నారు. గ్రామంలో వెంటనే అతిసారం నివారణ చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. వెంటనే ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్‌బాబు ఆధ్వర్యంలో ఆ గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో విస్తృతంగా పారిశుధ్య మెరుగు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు తదితరులున్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం


ఎద్దులపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి

పామిడి: జనరంజక పాలన అందించిన జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని ఎద్దులపల్లిలో నిర్వహించిన ప్రచారంలో ప్రజలు ఎమ్మెల్సీకి నీరాజనం పలికారు. అలాగే పార్టీ నాయకుడు, కబడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డి మండలంలోని పాళ్యంతండా గ్రామంలో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో వారికి ఘన స్వాగతం లభించింది. ఈసందర్భంగా వారు మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగించిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు. ప్యాకేజీ దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ మాటలు నమ్మొద్దన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యేగా వై వెంకట్రామిరెడ్డి, అనంతపురం ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ నీలాబాయి, సర్పంచ్‌లు వెంకటేశ్‌నాయక్, వెంకరమణమ్మ, వీరా, వెంకటేష్‌నాయక్, మండలనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల ఐక్యత చాటుదాం.. జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

● ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల


మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, పెన్నోబులేసు

బెళుగుప్ప: రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడానికి దళితుల ఐక్యతను చాటుదామని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు అన్నారు. మంగళవారం మండలంలోని తగ్గపర్తి, బెళుగుప్ప గ్రామాల్లో మండల దళిత సంఘం పార్టీ నాయకులతో కలిసి 'ఫ్యాన్ గుర్తుకు ఓటు- భావితరాలకు మలుపు' అంటూ దళిత వాడల్లో ప్రచారం చేశారు. దళితులపై అహంకారంతో మాట్లాడిన చంద్రబాబుకు ఓట్లడడగడం సిగ్గుచేటన్నారు. ఐక్యతతో దళితులంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నిత్యం ప్రజాసేవలో ఉండే విశ్వేశ్వరరెడ్డిని ఎమ్మెల్యేగా, శంకరనారాయణను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది అశ్వర్థనారాయణ, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి తిప్పేస్వామి, మండల కార్యదర్శి నరేంద్ర, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు పురుషోత్తం రాజు, ఎంపీటీసీ ఈశ్వర్, పార్టీ నాయకులు కరుణాకర్, బండయ్య, వెంటేశులు, పాతన్న, పెద్దన్న, నరసింహులు, మల్లేసు, దేవేంద్ర, గౌరి, తిమ్మన్న పాల్గొన్నారు.

కాపులకు సీఎం జగన్ పెద్ద పీట


బలిజల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులకు పెద్ద పీట వేశారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బలిజ సంఘం మండల అధ్యక్షుడు బండి సత్య స్వగృహంలో మంగళవారం రాత్రి బలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, బలిజ సంఘం అధ్యక్షుడు బండి సత్య, ఉమ్మర్, ఆముదాల గిరిధర్‌తో కలిసి మాట్లాడారు. కాపులు అంటే జగన్‌కు చాలా ఇష్టమన్నారు. అందుకే ఆరుగురు కాపులకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాపు నేస్తం, కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సారి కూడా అధికంగా ఎమ్మెల్యే స్థానాలు కాపులకు ఇచ్చారన్నారు. కాపులందరూ మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, సభ్యులు, బలిజ కులస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతాం


ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను కలసిన నాయకులు

వజ్రకరూరు: తామంతా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని, రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలో వాస్తవం లేదని చిన్నపులికొండ, బలిజ శ్రీనివాసులు తదితరులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను వారు కలిశారు. గ్రామానికి సంబంధించిన పలు అంశాలను ఎంపీ అభ్యర్థి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసినట్లు ఓ పత్రికలో ప్రచురితం కావడాన్ని వారు ఖండించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ విజయానికి కృషి చేస్తామని వెల్లడించారు.

విశ్వేశ్వరరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

● కొనకొండ్లలో విశ్వ సతీమణి వై.భువనేశ్వరి ప్రచారం


కొనకొండ్లలో ప్రచారం చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి సతీమణి భువనేశ్వరి

వజ్రకరూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని విశ్వేశ్వరరెడ్డి సతీమణి వై.భువనేశ్వరి ఓటర్లను కోరారు. మంగళవారం కొనకొండ్ల గ్రామంలో భువనేశ్వరి విస్తృతంగా ప్రచారం చేశారు. ముందుగా కొనకొండ్లలో భువనేశ్వరికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్డె మహేష్, మాజీ సర్పంచు దాసరిగోవిందు, యువజన విభాగం కార్యదర్శి రంగనాథ్‌యాదవ్, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ, నాయకులు గోరంట్ల రామకృష్ణ, వడ్డేచంద్రా, వడ్డే లింగరాజు, చైతన్యకుమార్, కొనకొండ్ల సంజప్ప, బోయ నాగరాజు, బోయగోవిం దు, హరి, గోరంట్ల శ్రీరాములు, బాపనపల్లి శివ, లక్ష్మీనారాయణ, జయన్న, విశ్వేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

గుత్తి: పాస్టర్ల గౌరవ వేతనం మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గుత్తికి చెందిన పాస్టర్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు నెలలకు సంబంధించిన వేతనం రూ. 20 వేలు ఒకేసారి మంజూరు చేశారన్నారు. పాస్టర్లందరూ ఎంతో సంతోష పడుతున్నారన్నారు. మరోసారి జగన్ సీఎం కావాలని ఏసును ప్రార్థిస్తున్నానన్నారు.

వైఎస్సార్‌సీపీకే గిరిజనుల మద్దతు


జీవీఎస్ఎస్ నేత పురుషోత్తం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీకే గిరిజనులు మద్దతు ఉంటారని జీవీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే పురుషోత్తం స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గిరిజన సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో గొప్ప సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాటిని అమలు చేశారన్నారు. గిరిజనులు జగన్ చేసిన మేలును మరవలేరన్నారు. ఉరవకొండలో వై.విశ్వేశ్వరరెడ్డి విజయం కోసం గిరిజనులు విస్తృతంగా ప్రచారం చేస్తారన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పామిడి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు 20 వార్డులకు సంబంధించి సమావేశం ఉంటుందని పార్టీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి వార్డుల ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లు, పరిశీలకులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తారన్నారు. 20 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు నాలుగు గ్రామాల్లో విశ్వన్న ప్రచారం

బెళుగుప్ప: మండలంలోని విరుపాపల్లి, వెంకటాద్రిపల్లి, ఆవులెన్న, బెళుగుప్ప గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ప్రచారం చేస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు విరుపాపల్లిలో ప్రచారం ప్రారంభిస్తారన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

గుంతకల్లు/ఉరవకొండ: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతుంది. గుంతకల్లులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో మంగళవారం 203 మంది పీఓ, ఏపీఓ, ఓపీఓలు బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నట్లు నోడల్ ఆఫీసర్ వీ.చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు 2,119 మంది ఓటు వేశారన్నారు. ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మరో ఫెసిలిటేషన్ కేంద్రంలో దాదాపు 284 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా ఈ రెండు రోజుల్లో 226 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఇక దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారు ఇప్పటి వరకు 209 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. అలాగే ఉరవకొండలోని ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళవారం ఒక్కరోజు 365 మంది ఉద్యోగులు ఓట్లు వేశారు. ఓటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి 1,787 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు ఏఈఓఆర్‌ఓ శిరీష తెలిపారు.

మామిడితోట కంచెకు నిప్పు

కూడేరు: మండలంలోని కమ్మూరుకు చెందిన రైతు నరేష్ మామిడి తోట కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సర్పంచ్ చిన్న రంగారెడ్డి, స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్‌తో మంటలు ఆర్పేశారు. అప్పటికే సుమారు 40 మామిడి చెట్లు కాలిపోయాయి.

నడవలేని ఓటర్ల కోసం వీల్ చైర్లు

కూడేరు: ఆరోగ్య సమస్యలతో పోలింగ్ కేంద్రానికి నడవలేని ఓటర్ల సౌకర్యార్థం వీల్ చైర్లు ఏర్పాటు చేసినట్లు ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి మంగళవారం తెలిపారు. పంచాయతీ నిధులతో ఒక్కొక్కటి రూ.5 వేలుతో కొనుగోలు చేశామన్నారు.

గుండె పోటుతో మత్స్యకారుడు మృతి

కూడేరు: పీఏబీఆర్ డ్యాంలో బోయ కుంటెన్న (48) అనే మత్స్యకారుడు మంగళవారం చేపలు పడుతూ గుండెపోటుకు గురై కుప్పకూలాడు. తోటి మత్స్యకారులు, కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోండి

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల నోడల్ అధికారి జీవీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రానికి ప్రహరీ నిర్మాణం

బెళుగుప్ప: మండల పరిధిలోని కోనాపురం పోలింగ్ కేంద్రానికి ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టారు. ఇటీవల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. మంగళవారం ఎస్‌ఐ శివ, పీఆర్ జేఈ సుధాకర్ ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం పరిసర ప్రాంతంలోని క్వారీ గుంతలో మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. ఏఎస్‌ఐ మాట్లాడుతూ చనిపోయిన యువకుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. 35 ఏళ్లు ఉంటాయని, నల్లని మొలతాడు, మెరూన్ రెడ్ కలర్ డ్రాయర్ ఉందన్నారు. గూళ్యపాళ్యం వీఆర్‌ఓ వన్నూరప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే


ఉరవకొండలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ఉరవకొండ: టీడీపీకి ఓటు వేస్తే మత తత్వ పార్టీ బీజేపీకి ఓటు వేసినట్లవుతుందని మైనార్టీ విభాగం నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక వెలిగొండ రోడ్డులోని జామియా మసీదు వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీతో పాటు బీజేపీ అగ్రనేతలు మైనార్టీలకు అధికారంలోకి రాగానే కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్లు తీసేస్తామని ప్రకటించారన్నారు. మైనార్టీలు ఓటు వేసే ముందు తమ కోసం, తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించాలని, టీడీపీని ఓడించాలని కోరారు. ఉరవకొండలో అత్యధికంగా ఉన్న మైనార్టీలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావులకేశవ్ ఓటమే ధ్యేయంగా సైనికుల్లా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కవ్వత్రాళ్ల బషీర్, జీఎంఎస్ మీరంబాషా, జీఎంఎస్ షాకీర్, పామిడి జాకీర్, పామిడి సలీం, షమ్ము, జెండా జిలాన్, వడ్లసలీం, అయ్యర్‌దాదు, బొంబాయి సెట్ మైనులు, శర్మాస్ పాల్గొన్నారు.


గుత్తిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం, సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. అలాగే గుత్తి , గుత్తి ఆర్‌ఎస్‌లలో భారీ ర్యాలీలు నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్మన్లు బిందె వరలక్ష్మి, పద్మలత, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, రంగ ప్రసాద్ రాయల్, బేడల వెంకటరాముడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, గురు ప్రసాద్‌యాదవ్, రంగప్రసాద్ రాయల్, సీపీ రంగారెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, జిల్లా క్రిష్టియన్ మైనార్టీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లి, గొందిపల్లి, బేతాపల్లి గ్రామాల్లో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ వై.సుభాష్‌రెడ్డి మంగళవారం ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసుదేవరెడ్డి, నాయకులు శేషారెడ్డి, పుల్లారెడ్డి, మనోహర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహులు, బాలకృష్ణ, ప్రభాకర్, నాగిరెడ్డి, నమేష్, గంగాధర్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మల్లయ్యయాదవ్, బేడల వెంకట్రాముడు, రఘునాథ్‌రెడ్డి, రంగస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పామిడిలోని 15, 16వ వార్డులో మంగళవారం వైఎస్సార్‌సీపీ విజయం కోసం ముమ్మర ప్రచారం చేశారు. వార్డుల ఇన్‌చార్జ్‌లు, బీసీసెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, కేఎం మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వెంకట్రామిరెడ్డికి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఫర్యాద్, సాదక్‌వలి, చీమల అమర్‌నాథ్, హుశేన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010223701